

# ప్రమాదం జాగ్రత్త!

## – కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

9

**నీళ్ళు వేగంగా** ప్రవహిస్తున్నాయి. అదృష్టం. ప్రవాహానికి యెదురు యీదవలసిన అవసరం లేదు. కానీ ఎంత దూరం యీదాలి. ఏ ప్రాంతాల వొడ్డుకి చేరుకోవాలి. ఈదుతూ అటూ యిటూ చూస్తున్నాడు అతను. కేకలు వినిపించడంలేదు. దీపాల కాంతి పడడంలేదు. ఇక ఈదలేడు, అలసిపోయాడు.

మోకాలిలోతు బురదలో నడుస్తున్నాడు చీకట్లో. అతను యెక్కడ ఏ ప్రాంతంలో వున్నదీ కూడా తెలియదు. క్షణం ఆగి, సిగరెట్ వెలిగించి, ఆలోచిస్తూ అక్కడే నిలుచున్నాడు. ఆలోచిస్తే తనకే ఆశ్చర్యంగా వుంది. సులభంగా పోలీస్ వాన్‌లోంచి తను యెలా తప్పించుకున్నాడు.

పోలీస్ వాన్ తలుపు సామాన్యంగా తాళం వేస్తారే? తాళం వెయ్యలేదు. గడియ కూడా వొదులుగా వుంది. ఒక తన్ను తన్నగానే తెరుచుకుంది. అంతే కాదు, వాన్‌లో తనకి కాపలా వున్న యిద్దరు పోలీసులు రాత్రంతా నిద్రలేనట్లు కునుకులు తియ్యడం వల్ల పారిపోవడానికి తనకి అవకాశం దొరికింది. అంతేకాదు. సామాన్యంగా హత్య కేసుల్లో దోషులకు చేతికి సంకెళ్ళు వేస్తారు. తన చేతికి సంకెళ్ళు కూడా వెయ్యలేదు. పోలీసులు యెందుకు తనపట్ల అంత సానుభూతితో, ఆప్యాయతతో ప్రవర్తించారు? తను అడగలేదు. ఎవరో పెద్ద పోలీస్ ఉద్యోగి వచ్చి అతనే అడిగాడు. "నువ్వు నిజంగా నిర్దోషివి అయితే లై డిటెక్టర్ టెస్టు తీసుకుంటావా?" అని. తను అంగీకరించాడు. అంతా కలిసి, ఒక క్రమంగా ఆలోచిస్తే అందులో ఏదో మోసం వుందని అనిపిస్తోంది. అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు. బురదలేదు. గడ్డి, చెట్లు. దరిదాపుల్లో ఏదైనా పల్లె వుందేమో! జాగ్రత్తగా ఉండాలి, అక్కడే కూర్చున్నాడు అతను.

తెల్లారింది. మంచి ఎండ. ఆ ఎండలో తడిసిన బట్టలు ఎండ పెట్టుకున్నాడు. రెండు గంటల తర్వాత పొడి బట్టలు వేసుకున్నాడు. ఎలాగయినా తన మొహం మార్చుకోవాలి. దేనితో? అటూ ఇటూ చూస్తూ నడుస్తున్నాడు. ఎవరో ఒక చెట్టుకింద యేదో వండుకున్నారు. నల్లగా కాలిన కర్రముక్కలు, మసీ కనిపించాయి. ఆ మసిని తీసుకుని, అరచేతిలో పోసుకుని బాగా రుద్దుకుని, మొహానికీ, చెవులకీ, చేతులకీ బాగా రుద్దుకున్నాడు. అద్దంలేదు. కానీ తెలుసు నల్లగా తయారయాననీ, యెవరూ సులభంగా గుర్తుపట్టలేరనీ. ఇప్పుడు ఏ పల్లెటూరో చేరుకుని ఏదయినా తినాలి. ఆకలి వేస్తోంది. అరఫర్లాంగు దూరం వెళ్ళాడు. ఆ ప్రాంతాల మనిషి సంచారం లేదని నిశ్చయించుకుని ధైర్యంగా యీల వేసుకుంటూ నడుస్తున్నాడు.

"ఢాం" అని పేలింది. గుండు కాలి పిక్కకు తగిలింది. ఒక్క గంతున ఒక్క చెట్టు వెనక్కి వెళ్ళి దాక్కున్నాడు. ఎవరు? యెవరు తన మీద గుండు పేల్చింది. షర్టు చింపి కాలికి గట్టిగా కట్టుకున్నాడు. వెనక్కి తిరిగి చూశాడు. దట్టంగా పెరిగిన చెట్లు, గడ్డి పొదలు, నేల మీదకి వొంగి వెనక్కి పాక్కుంటూ ఆ పొదల వెనక్కి వెళ్ళాడు. మళ్ళీ ఢాం అని పేలింది. కానీ ఈసారి గుండు తగలలేదు. అతను

పొదలలోకి వెళుతున్నాడు. వెనక యేదో అలికిడి అయింది, చటుక్కున వెనకి తిరిగాడు. ఒక సాయుధ పోలీస్ తుపాకీ తన మీదకి గురిపెట్టి, మీట నొక్కపోతున్నాడు. ఆలోచించడానికి కూడా వ్యవధి లేదు అతనికి. ఒక్క ఉరుకు ఉరికాడు, పులిలా. అతను మీట నొక్కేలోపున అతని మీద పడ్డాడు. ఆ పోలీస్‌ని తలమీద బాదాడు. ఆ పోలీస్‌కి స్పృహ పోయింది. వెంటనే అతను పోలీస్ కానిస్టేబుల్ యూనిఫాం తీసేసి తను తొడుక్కుని, అతని తుపాకీ తీసుకుని ఆ పొదలలోకి పరిగెత్తాడు.

## 10

డిటెక్టివ్ యుగంధర్ తిరిగి రాగనే, రాజు, కాత్యా రాధ ప్రశ్నార్థకంగా చూశారు.

''శిఖామణి తను హత్య చేసినట్టు కన్షనల్ స్టేట్‌మెంట్ యిచ్చాడట'' అన్నాడు యుగంధర్.

''బలవంతాన హింసించి, పోలీసులు అటువంటి స్టేట్‌మెంట్ తీసుకుంటారు'' అన్నది రాధ.

''కరా బరేటింగ్ ఎవిడెన్సు వుందిట. అంటే విడిగా అతను ఇచ్చిన స్టేట్‌మెంటుకి ప్రాముఖ్యం ఏమీలేదు. పోలీసులు బలవంతంగా అటువంటి స్టేట్‌మెంటు తీసుకుంటే, దాన్ని కోర్టులో ఉపసంహరించుకోవచ్చు. అదికాదు సమస్య శిఖామణి తప్పించుకుని పారిపోయాడు'' అని వివరాలు చెప్పాడు యుగంధర్.

''అయితే షూట్ హిమ్ ఆన్‌సైట్ ఆర్డర్స్ యిచ్చారన్నమాట'' అన్నాడు రాజు. యుగంధర్ తల ఊపాడు. ''ఐ వోంట్ లయక్ యిట్. హత్య కేసులో ముద్దాయిగా వున్న మనిషిని పోలీసులు తప్పించుకుని పోనిచ్చారంటే ఆశ్చర్యంగా ఉంది. అంతేకాదు, అంత పటిష్టమైన కేసుండగా, లై డిటెక్టర్ టెస్టుకి అంగీకరించారంటే అదీ ఆశ్చర్యంగా ఉంది. ఈ కేసు జోలికి నన్ను పోవద్దని, ఉన్నత పోలీసు ఉద్యోగులు నన్ను వారిస్తున్నారంటే మరీ ఆశ్చర్యంగా వుంది'' అన్నాడు యుగంధర్.

''యుగంధర్‌గారూ, నేను డబ్బు యెక్కువ యిచ్చుకోలేను, కానీ నా జీవితంలో..''

''రాధా, డబ్బు విషయం యిప్పుడు చర్చించనవసరంలేదు. నన్ను ఆలోచించనియ్యి'' అన్నాడు యుగంధర్.

## 11

తోవలో చెట్ల ఆకులు, ఏవో పళ్ళు కోసుకుని తిని ఆకలి తీర్చుకున్నాడు అతను. అలా పొదల్లోంచి, చెట్ల మధ్యనించి నడిచి, నడిచి మధ్యాహ్నానికి ఒక ఊరు చేరుకున్నాడు. అది చిన్న పల్లెకాదు. పెద్ద ఊరూ కాదు. జర్నాల ఆ ఊరి పేరు. బొంబాయికి చాలా దూరం, అతనికి తెలుసు. నల్లగా వున్న అతన్ని, పోలీస్ కానిస్టేబుల్ని, వీధుల్లో జనం విచిత్రంగా చూస్తున్నారు.

''పోలీస్ స్టేషన్ ఎక్కడున్నది?'' అడిగాడు అతను.

''తిన్నగా వెళ్ళి, కుడివైపుకి తిరిగితే'' యెవరో చెప్పారు. అతను తల ఊపి రెండు అడుగులు వేసి, ఒక పత్రికల కొట్టు దగ్గరగా ఆగి ఆ రోజు దినపత్రిక తీసుకున్నాడు. ముందు పేజీలోనే వుంది.

''షీలా ముఖర్జీ హత్యకేసులో ముద్దాయి శిఖామణి పరారీ. కంటికి కనిపిస్తే షూట్ చెయ్యమని పోలీసులకి ఆదేశం'' అతను మిగతా వివరాలు చదవలేదు. పత్రిక కొట్లో పడేసి చకచక నడిచాడు. పోలీస్ స్టేషన్‌కి వెళ్ళడం అతని ఉద్దేశం కాదు. బస్‌స్టాండ్ కనిపించింది.

''బొంబాయి ఎక్స్‌ప్రెస్.. బొంబాయి'' అరుస్తున్నారు. బస్ దాదాపు నిండిపోయింది.

''ఓవర్‌లోడ్ చేస్తావా! అన్ని సీట్లు అమ్మేశావుగా బయలుదేరు'' అన్నాడు అతను. పోలీసు దుస్తుల్లో తుపాకీతో వున్న అతని మాటలు విని, కండక్టర్ బస్ స్టార్టు చేశాడు.

బొంబాయి వెళ్ళి, తర్వాత ఆలోచిస్తున్నాడు. అతనే శిఖామణి.

"డాక్టరు పంకజరావు ఏమైందీ పోలీసులు తెలుసుకోలేకపోయి ఉండవచ్చు. కానీ కాత్యా నువ్వు తెలుసుకోగలవనుకుంటాను" అన్నాడు యుగంధర్.

రాజు నిరాశతో యుగంధర్ని చూశాడు. "అలా మొహం వేలవేయక. శిఖామణి తోడుదొంగ కరుప్పన్ ఎక్కడున్నాడు, ఏమయ్యాడు నువ్వు కనుక్కోవాలి" అన్నాడు రాజుతో.

"వెంటనే బయలుదేరతాను" అన్నాడు రాజు.

"ఈ రాత్రా, ఎక్కడికి? ఒక పథకం వేసుకుని, ఒక క్రమ పద్ధతిలో దర్యాప్తు ప్రారంభించండి. ఈ రాత్రికి చెయ్యగలిగింది ఏమీలేదు. నిద్రపోదాం. కాత్యా రాధకి గెస్టు రూంలో పడక ఏర్పాటు చెయ్యి. జాగ్రత్త" అన్నాడు యుగంధర్.

బస్ బొంబాయి చేరుకునేటప్పటికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. అందరికన్నా ముందుగా శిఖామణి బస్ దిగేశాడు. రాత్రి చీకట్లో టకటక నడుస్తున్నాడు. పోలీసు దుస్తులల్లో వున్న తనని యెవరూ అనుమానించరనీ, పట్టుకోలేరనీ ధైర్యం. తను యెక్కడికి వెళ్ళాలో ఏం చెయ్యాలో బస్‌లోనే నిర్ణయించుకున్నాడు. నాలుగు మైళ్ళు నడిచాడు. దూర దూరంగా వున్న యిళ్ళు. అది మలబార్ హిల్ ప్రాంతం. ఒక యింటిగేటు ముందు ఆగాడు. తుపాకీతో గేటుమీద ఒక దెబ్బ వేశాడు. జవాను నిద్రలోంచి లేచి "ఎవరు?" అడిగాడు.

"జడ్జి గోపాలయ్యర్ యింట్లో ఉన్నారా?"

"ఉన్నారు, ఏం కావాలి?" అడిగాడు జవాను.

"ఆయన్ని కలుసుకోవాలి."

"ఇంతరాత్రా, పోలీసు వాడివి. నీకు ఆ మాత్రం బుద్ధిలేదూ! వెళ్ళు."

"అత్యవసరం కలుసుకోవాలి"

"ఎంత అవసరమైనా అయ్యగార్ని యిప్పుడు -"

దూరాన అడుగుల చప్పుడు వినిపిస్తోంది. ఏ బీట్ కానిస్టేబులో అయ్యుంటే, శిఖామణి యిక తటపటాయించలేదు. తుపాకీ ఆ జవాను మీద గురిపెట్టి "కాలుస్తాను. గేటు తియ్యి" అన్నాడు. జవాను బెదిరిపోయి గేటు తీశాడు. "మూసెయ్యి" మూసేశాడు.

"నువ్వు ముందు నడు" జవాను కిక్కురుమనకుండా ముందుకి నడిచాడు.

పెద్ద పోర్టికో, పెద్ద వసారా, పెద్ద తలుపు. తలుపు తెరిచే వుంది.

హాల్లో కూర్చునున్నాడు యాభయి అయిదేళ్ళ మనిషి. బట్టతల. లావు, ఠీవి, దర్పమూ. ఏదో పుస్తకం చదువుతున్నాడు.

"సర్!" అన్నాడు శిఖామణి.

ఆయన తల యెత్తి తలుపు వేపు చూశాడు. ముందు గేటు జవాను. వెనక తుపాకి పుచ్చుకున్న ఒక పోలీస్.

"ఏమిటది?" అడిగాడు.

శిఖామణి తుపాకీ నేలమీద పెట్టి, "క్షమించండి, యిలా దౌర్జన్యంతో మీ ఇంట్లో ప్రవేశించినందుకు. వేరే గత్యంతరం లేక చేశాను."

"ఎవరు నువ్వు?" అడిగాడు గోపాలయ్యర్ లేచి నిలబడి.

"నా పేరు శిఖామణి."

"శిఖామణి - షీలా ముఖర్జీ."

"పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోయిన ముద్దాయిని."

"ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అడిగాడు గోపాలయ్యర్.

"మీరు నన్ను మరచిపోయారనుకుంటాను. నా మొహానికి పూసుకున్న మసిని తుడిచి వేస్తే గుర్తుపడతారని ఆశ" అంటూ షర్టుతో మొహం బాగా తుడిచేసుకున్నాడు.

"ఆ!ఆ! నిన్ను ఎక్కడో చూసినట్టు.."

"ఒకసారి కాదు, చాలాసార్లు. మీ ఇంట్లో యెన్నోసార్లు భోజనం చేశాను. మీరు మద్రాసులో ప్రాక్టీస్ చేస్తున్న రోజుల్లో"

"నీ పేరు"

"శిఖామణి, పేరు మర్చిపోయారు. మొహం జ్ఞాపకమున్నది. మీ అబ్బాయి స్వామినాథన్, నేను క్లాస్‌మేట్స్, ఆప్తమిత్రులం. మేమిద్దరం కలిసి తీయించుకున్న ఫోటోలు ఇంట్లో వుండి ఉంటాయి."

"యస్, యస్.. జ్ఞాపకం వచ్చావు. ప్రెసిడెన్సీ కాలేజ్ లో చదివేవాడివి కదూ? అంత చదువుకున్నవాడివి"

"హంతకుణ్ణి ఎలా అయ్యానని అడుగుతారా! నేను హంతకుణ్ణి కాను. కానీ నన్ను చంపేస్తారు. మీరు ఒక్కరే రక్షించగలరు. అందుకని మీ దగ్గరకు వచ్చాను. మీకు ఏ హానీ తలపెట్టికాదు. నే చెప్పే విషయాలన్నీ విని, నన్ను పోలీసులకి ఒప్పగించండి."

గోపాలయ్యర్ చుట్ట వెలిగించాడు. తన కొడుకు స్వామినాథన్ యిప్పుడు అమెరికాలో, అంబెసీలో పనిచేస్తున్నాడు. స్వామినాథన్, శిఖామణి ఆప్తమిత్రులనీ, దాదాపు రోజూ శిఖామణి యింటికి వచ్చేవాడనీ గోపాలయ్యర్‌కి జ్ఞాపకం ఉంది.

"నీరసంగా ఉన్నావు. ముందు ఏమన్నా తిను. తరువాత చెప్పవచ్చు" అన్నాడు గోపాలయ్యర్.

## 12

రాజు, కాత్యా, కన్సల్టింగ్ రూంలోకి వచ్చేటప్పటికి యుగంధర్ దినపత్రిక చదవడం పూర్తి అయింది. మడిచి బల్లమీద పెట్టాడు.

"నేను పథకం వేశాను -" అన్నాడు రాజు.

"వెరీగుడ్, శిఖామణి కేసులో కొత్త మలుపు" అంటూ దినపత్రిక రాజుకిచ్చాడు. వాళ్ళకి కూడా తెలిసేందుకు రాజు బిగ్గరగా ఆ వార్త చదివాడు.

"లై డిటెక్టర్ టెస్టుకి తీసుకుని వెళుతుండగా, షీలా ముఖర్జీ హత్యకేసులో ముద్దాయి అయిన శిఖామణి పోలీస్ వాన్‌లోంచి దూకి పారిపోయిన విషయం పాఠకులకి తెలిసిన విషయమే. శిఖామణి ఎక్కడెక్కడో మారువేషాలలో తిరిగి, నిన్నరాత్రి జస్టిస్ గోపాలయ్యర్ యింటికి వెళ్ళాడు. పోలీసులు తన మీద కల్పితమైన కేసు బనాయించారనీ, తనని చంపడానికి పన్నాగం పన్నుతున్నారనీ, తనకి రక్షణ యివ్వమనీ జస్టిస్ గోపాలయ్యర్‌ని కోరాడు. జస్టిస్ గోపాలయ్యర్ శిఖామణిని జుడిషియల్ కస్టడీలోకి తీసుకున్నారు. ప్రతిరోజూ శిఖామణిని కోర్టులో హాజరు పరచాలనీ, శిఖామణికి యెటువంటి ఆపదా రాకుండా చూసుకోవాలనీ జస్టిస్ గోపాలయ్యర్ పోలీసు అధికారులని హెచ్చరించారు."

"డామిట్, చాలా చిత్రంగా వుంది" అన్నాడు రాజు.

"ఔను! శిఖామణి మీద మోపబడిన కేసు వివరాలు, సాక్ష్యాలు, ఒకసారి నేను స్వయంగా తెలుసుకోవాలి. ఈరోజే బొంబాయి వెళుతున్నాను. నేను చెప్పిన పనులు జాగ్రత్తగా చేయండి. రాధకు ఎటువంటి ఆపదా రాకుండా చూసుకోండి" అన్నాడు యుగంధర్.

## 13

బొంబాయి శాంతాక్రజ్ విమానాశ్రయంలో ఐ.జి ఆఫ్ పోలీస్ యుగంధర్ని కలుసుకుని, ఆహ్వానం చెప్పేసరికి యుగంధర్ ఆశ్చర్యపడ్డాడు.

"మద్రాసు ఐ.జి ఫోన్ చేసి చెప్పారు. మీరు వస్తున్నారని" అంటూ తన కారులో యెక్కించుకుని, "హోటల్ రూం బుక్ చేసుకున్నారా?" అడిగాడు.

"లేదు"

"అయితే ప్రెసిడెంట్ రాయల్లో దిగండి. కొత్తగా కట్టారు" అన్నాడు ఐ.జి

"నేను వచ్చినపని" అంటున్నాడు యుగంధర్.

"తర్వాత సావధానంగ మాట్లాడుకోవచ్చు. గంట తర్వాత కారు పంపిస్తాను. ఆఫీసుకి రండి" అని ఐ.జి యుగంధర్ని హోటల్లో దింపి వెళ్ళిపోయాడు. బొంబాయి ఐ.జి విమానాశ్రయంకి రావడంలో ఆశ్చర్యపడలేదు. ఇద్దరు చాలాకాలంగా స్నేహితులు. కానీ మద్రాసు ఐ.జి బొంబాయి ఐ.జి.కి ఫోన్లో చెప్పడం బొంబాయి ఐ.జి వెంటనే విమానాశ్రయంకి రావడం ఆశ్చర్యం కలిగించింది.

గంట తర్వాత యుగంధర్ బొంబాయి ఆఫ్ ఫోలీస్ గదిలో కూర్చున్నాడు. డి.ఐ.జీ, సి.బి.ఐ ఆఫీసర్ ఆ గదిలో ఉన్నారు.

"యుగంధర్గారూ! శిఖామణి భార్య రాధ మిమ్మల్ని కలుసుకున్నదనీ, శిఖామణి హంతకుడు కాదని మీరు అభిప్రాయపడుతున్నారనీ, దర్యాప్తు చెయ్యడానికి మీరు బొంబాయి వస్తున్నారనీ మద్రాసు ఐ.జి చెప్పారు" అంటున్నాడు ఐ.జి.

"అంతేకాదు, ఇదిగో శిఖామణి తనకై తను, యెవరి ప్రోద్భలమూ లేకుండా, నేరాన్ని ఒప్పుకుంటూ ఇచ్చిన స్టేట్మెంట్. సంతకం పెట్టాడు. అంతేకాదు, టేప్రికార్డర్ మీద రికార్డు చేశాము. కావలిస్తే అది వినండి" అన్నాడు ఐ.జి.

"వినిపించండి" అడిగాడు యుగంధర్. ఐ.జి టేప్ రికార్డర్ స్విచ్ నొక్కాడు. "నేను, శిఖామణి, బుద్ధిపూర్వకంగా, ఎవరి ప్రోద్భలమూ లేకుండా నాకై నేను, ఇస్తున్న వాగ్మూలం. అక్టోబర్ 5 వ తేదీ రాత్రి, ఎనిమిది గంటల ముప్పయి నిముషములకి, ప్లాజా థియేటర్ ఐస్క్రీం షాపువద్ద శ్రీమతి షీలా ముఖర్జిని చూశాను. ఆమె చాలా అందగత్తె. ఇదివరలో ఆమెను ఒకసారి చూశాను. ఆమె వింగ్ కమాండర్ ముఖర్జీ భార్య అని నాకు తెలుసు. ఆ రాత్రి ఆమెని చూడగానే ఓ వెర్రికోరిక కలిగింది. క్రితం రోజు నేను ఒక అంబాసిడర్ కారుని దొంగలించాను. వింగ్ కమాండర్ ముఖర్జీ ఆపదలో ఉన్నాడని, ఆక్సిడెంటు జరిగిందనీ ఆమెకి చెప్పి, ఆమెనీ, పిల్లల్నీ కారు యెక్కించుకున్నాను. కారు బయలుదేరిన వెంటనే క్లోరోం ఉపయోగించి, ఆమెకు స్పృహపోగొట్టాను. కారు డ్రయివ్ చేస్తున్నది నా స్నేహితుడు కరుప్పన్ కొంతదూరం వెళ్ళాక, ఆ పిల్లల్ని ట్రంక్ రోడ్డు మీదకి తోసేశాను. తర్వాత, షీలాకి స్పృహ వచ్చిన తర్వాత ఆమెను పొందడానికి ప్రయత్నించాను. ఆమె ఎదురు తిరిగింది. కార్లో నా పని సాధ్యం కాకపోవటంవల్ల, కారు ఒకచోట ఆపమని కరుప్పన్కి చెప్పి, షీలాని బలవంతంగా పొదల వెనక్కి లాక్కెళ్ళి, మానభంగం చేశాను. ఆమె అరవకుండా ఆమె నోటిని నొక్కిపట్టాను. ఆమె తల విదిలించడం వల్ల, నోరుమీద పట్టు సడలిపోవడంవల్లా, ఆ కామాంధకారంలో నేను చేస్తున్న పని నాకే తెలియలేదు. నాకు తెలియకుండానే షీలా గొంతు నులిమి చంపేశాను. షీలాని చంపాలనే ఉద్దేశం నాకు లేనేలేదు" ఒక నిట్టూర్పు వదలడం తప్ప ఏమీలేదు. స్పష్టంగా వినిపించాయి మాటలు.

డి.ఐ.జి టేప్ రికార్డర్ స్విచ్ ఆఫ్ చేశాడు.

సి.బి.ఐ ఆఫీసరు గొంతు సవరించుకుని, "శిఖామణి భార్య రాధ చెప్పిన విషయాల గురించి చర్చించడం అనవసరం. శిఖామణి మీద మోపబడిన నేరం ఆధార రహితమైనదా, కాదా అని ఆలోచించండి. అది చాలు. ప్రాసిక్యూషన్ వార్నించి యివన్నీ తీసుకు వచ్చాము. మిమ్మల్ని తృప్తిపరచడానికి" అన్నాడు.

"ఏమిటివి?" అడిగాడు యుగంధర్.

"ఇవి వేలిముద్రల ఫోటోలు శిఖామణివి, యివి అంబాసిడర్ కారు స్టీరింగ్ వీల్ మీద వున్న వేలిముద్రల ఫోటోలు"

యుగంధర్ పరీక్షగా చూశాడు.

"ఇది శిఖామణి జేబు రుమాలు. లాండ్రీ గుర్తు చూడండి. గలైనాలక్ లాండ్రీవారు యిచ్చిన స్టేట్‌మెంట్ చూడండి. ఈ రుమాలు శిఖామణిదేనని రుజువవుతోంది."

అదీ చూశాడు యుగంధర్.

"పూనాలో పెట్రోలు బంకు గుమాస్తా యిచ్చిన స్టేట్‌మెంట్, ముఖర్జీ అబ్బాయి మేజిస్ట్రేటు ముందు చెప్పిన విషయాలు విడివిడిగా వ్రాశాము."

"కరుప్పన్‌ని కూడా పట్టుకున్నారా?"

"లేదు, దొరకలేదు. అతనెక్కడున్నదీ శిఖామణికే తెలియదన్నాడు. లేక తెలిసీ చెప్పడంలేదో"

"శిఖామణి పారిపోయినట్టు, జస్టిస్ గోపాలయ్యార్ శరణు కోరి జుడీషియల్ కస్టడీలో ఉన్నట్టూ పత్రికలో చదివాను. శిఖామణి హత్య చేసినట్టు ఇంత సాక్ష్యం ఉండగా, అతను నేరం అంగీకరిస్తూ వాఙ్మూలం ఇచ్చిన తరువాత కూడా, మీరు లై డిటెక్షన్ టెస్టుకి యెందుకు సమ్మతించారు? అవసరం ఏం కలిగింది?"

"దట్ ఈజ్ ఏ వెరీ గుడ్ పాయింట్ మిస్టర్ యుగంధర్. తను నేరం చేసినట్టు ఒప్పుకున్న తరువాత, గంట తర్వాతే తను నిర్దోషిననీ, తనని పోలీసులు బెదిరించడంవల్ల అటువంటి వాగ్మూలం యిచ్చాననీ అతననడం ప్రారంభించాడు. జైలు అధికారులు కబురు చెయ్యగానే నేనే స్వయంగా వెళ్ళాను జైలుకి. తనకి లయడిటెక్టర్ టెస్టు యివ్వమని అడిగాడు. అతని మాటల్లో నమ్మకం ఉండికాదు, న్యాయం చేస్తున్నామని అతనికే అనిపించాలని ఒప్పుకున్నాను."

యుగంధర్ చిరునవ్వు నవ్వాడు. "శిఖామణి పారిపోయినపుడు అతని చేతికి సంకెళ్ళు ఉన్నాయా?" అడిగాడు.

"సిటీలో, అందులోనూ పోలీస్ హెడ్ క్వార్టర్సు కదా అని వెయ్యలేదు. చాలా తప్పు చేశాడు ఎస్.ఐ. అతన్ని సస్పెండ్ చేశాను" చెప్పాడు ఐ.జి.

"శిఖామణి హంతకుడని ఇప్పుడైనా ఒప్పుకుంటారా?" అడిగాడు.

"సిటీలో, అందులోనూ పోలీస్ హెడ్ క్వార్టర్సు కదా అని వెయ్యలేదు. చాలా తప్పు చేశాడు ఎస్.ఐ. అతన్ని సస్పెండ్ చేశాను" చెప్పాడు ఐ.జి.

"శిఖామణి హంతకుడని ఇఒప్పుడైనా ఒప్పుకుంటారా?" అడిగాడు సి.బి.ఐ డైరెక్టరు. యుగంధర్‌కి అతనితో కూడా పరిచయం వుంది.

"ఒక మనిషి న్యాయస్థానంలో దోషి అని నిర్ణయించబడేవరకూ అతను ముద్దాయేగానీ, దోషికాడని నేను చదువుకున్న న్యాయశాస్త్రం చెపుతుంది" అన్నాడు యుగంధర్.

"యు ఆర్ కరెక్ట్ మిస్టర్ యుగంధర్. శిఖామణి మీద నేరం ఆరోపించడానికి తగినంత సాక్ష్యం వుందనే చెపుతున్నాము, అంతే. సాక్ష్యాన్నిబట్టి శిఖామణి హంతకుడు అని కోర్టు నిర్ణయిస్తుందనే నమ్మకమూ వెలిబుచ్చాం అంతే. మీరూ ఒప్పుకుంటారనుకుంటాను" అన్నాడు ఐ.జి.

"ఒప్పుకుంటాను. ఎంత సాక్ష్యం, బలమైన సాక్ష్యం సంపాయించారు మీరు శిఖామణి హంతకుడని నిరూపించడానికి. ఒక్కొక్కప్పుడు బలంగా కనిపించే సాక్ష్యం, కోర్టులో క్రాస్ ఎగ్జామినేషన్‌లో చాలా బలహీనమవుతుంది. శిఖామణి ఈ హత్య చేశాడో, లేదో నేను ఒక నిర్ణయానికి రాలేదు. ఒకసారి శిఖామణిని కలుసుకోడానికి నాకు అవకాశం కలిపిస్తే"

"నో! నో! దట్ యీజ్ నాట్ పాసిబుల్. శిఖామణి పోలీసు కస్టడీలో లేడు. జుడిషియల్ కస్టడీలో ఉన్నాడు" అన్నాడు డి.ఐ.జి.

"నాకు క్రిమినల్ ప్రోసీజర్ చెప్పిస్తారా?" అని యుగంధర్ నవ్వి.

"మీరు ఆ ఏర్పాటు చెయ్యకపోతే సరే, నేను వెళ్తాను" అన్నాడు యుగంధర్.

## 14

దేశంలో యే మారుమూల వున్నాడో, యే మారు వేషంలో తిరుగుతున్నాడో? కరుప్పన్ ఆనవాలు మాత్రం చెప్పింది రాధ. ఎర్రగీతలున్న నల్లని లుంగీ, పసుపుమీద ఆకుపచ్చరంగు పువ్వులున్న షర్టు. మెళ్ళో నల్లని రుమాలు చుట్టుకుని రాజు బయలుదేరాడు. మూర్ మార్కెట్, సెవెన్ హిల్స్, వాషర్ మెన్ పేట, తాండియార్ పేట ప్రాంతాల్లో చాలాసేపు తిరిగాడు. అలా తిరిగితే తన విషయం, ఎవరికో తెలిసి, ఎవరో ఒకరు తనని కలుస్తారని ఆశ. హార్బర్ ప్రాంతంలో ఎవరో నలుగురు పేక ఆడుతున్నారు. రాజు వాళ్ళ వెనక వెళ్ళి నిలుచున్నాడు.

"అలా నిలబడ్డావేం? వస్తావా ఆటకి?" అన్నాడు ఒకడు.

రాజు పేకాటకి కూర్చున్నాడు. వాళ్ళల్లో ఇద్దరు మోసం చేస్తున్నారని రాజుకు తెలుసు. లేక, నలుగురూ కలిసి మోసం చేస్తున్నారో? తన డబ్బు చాలాపోయింది. ఓపిగ్గా కాచుకున్నాడు. వెనక దాచిన పేకముక్క ఒకడు తీస్తున్నప్పుడు చెయ్యి పట్టుకుని "ఒరి వెధవా! మోసం చేస్తున్నావా? మోసం చేసి డబ్బు లాగుతున్నావా! కక్కు నా డబ్బంతా" అరిచాడు. బాగా చీకటి పడింది. ఆ ప్రాంతంలో ఎవరూ లేరు.

"చెయ్యి వొదులు, డబ్బుట, డబ్బు కావాలట, యింటికి వెళ్ళరా" అన్నాడు ఒకడు కత్తి తీసి రాజుని బెదిరిస్తూ. ఆ కత్తిని చూడగానే, చాలా కాలంగా తన కండలకి పనిలేకుండా వున్న రాజుకి ఉత్సాహం పెరిగింది. "ఒరేయ్! నువ్వు ఒక్కడివా! యిచ్చెయ్యి డబ్బు లేకపోతే ఎముకలు విరగగొడతాను" అన్నాడు రాజు.

"వాడి చెయ్యి వెంటనే వదలకపోతే, ముందు నీ రక్తం చిమ్ముతుంది" అంటున్నాడు. రాజు ఒక్క గంతున లేచి, వాడి చేతిలో కత్తి కాలితో తన్ని ఎగరగొట్టాడు. కూర్చున్న ముగ్గురూ లేవకుండా, ఒక్కొక్కరి మెడమీద వరసగా తన్నాడు. వాళ్ళు లేవబోయారు. కానీ వీలుకాకపోయింది. కత్తి తీసిన వాణ్ణి పట్టుకుని చెయ్యి వెనక్కి మెలివేశాడు.

"ఊ! డబ్బు, యివ్వండి యిస్తారా, యింకా" అంటూ రాజు కత్తి పట్టుకున్నవాడి జేబులోంచి డబ్బంతా తీసుకున్నాడు. తర్వాత వాడ్ని డొక్కలో ఒక దెబ్బ కొట్టాడు. మూలుగుతు కిందపడ్డాడు వాడు. ఆ తర్వాత ఆ ముగ్గురి వద్దనున్న డబ్బంతా లాక్కున్నాడు.

"అరెరె! అదేం న్యాయం, నీ డబ్బుకాక మా డబ్బు కూడా తీసుకుపోతున్నావు" కాళ్ళపడ్డాడు ఒకడు.

"మోసం చేసి పేకాడేవాడివి, న్యాయం మాట్లాడుతావా" అని వెనక్కి తిరిగాడు రాజు.

"ఏమయ్యా! నీ కాళ్ళు పట్టుకుంటాను. ఆ డబ్బు మాదికాదు. మొదిలియార్‌కి కట్టాలి. కట్టకపోతే చీల్చేస్తాడు. మా డబ్బు"

"ఎవరా మొదలియార్?" అడిగాడు రాజు.

"దొంగసారాయి సరఫరా చేసే మొదలియార్. వారం రోజుల డబ్బు యిది."

"మొదలియార్ సారా ఒక్కటేనా, బ్రాందీ అవీ కూడా అమ్ముతాడా"

"ఒక్కటేమిటి, అన్నీ అమ్ముతాడు."

"సరే మీ డబ్బు మీకిచ్చేస్తాను. ఓ విషయం చెప్పండి."

"ఏమిటది?"

"కరుప్పన్ ఎవరు కరుప్పన్?"

"మీకు తెలియదన్నమాట, బహుశా మీ మొదలియార్‌కి తెలిసి వుంటుంది. మొదలియార్ యెక్కడుంటాడు?"

"అమ్మబాబు మొదలియార్ యెక్కడున్నాడో చెప్పడమే"

"చెప్పకపోతే" అంటూ రాజు కాలు ఎత్తాడు.

ఆ నలుగురు ఏవో సంజ్ఞలు చేసుకున్నారు. "సరే - సరే తీసికెళతాము" అన్నారు.

"కిటుకులు పనికిరావు. జాగ్రత్త" బెదిరించాడు రాజు.

సందుగొందులు తిరిగారు. ఒక మోటారు వర్కుషాపు దగ్గర ఆగి, తలుపు మీద చిన్న దెబ్బ వేశాడు ఒకడు. అయిదు నిమిషాల తర్వాత తలుపు వెనక మళ్ళీ ఒక చిన్న చప్పుడు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments